# చెట్టు

ఆ వీధిలోకి అడుగుపెట్టాలంటే నాకు బాధ ...
నా హృదయాన్ని ముద్దలా చేసి ఎవరో నలిపేస్తున్న భావన!...
జీవితం ఎంత విషాదభరితమైందంటే—
నేను ఆ వీధిలోకి వెళ్ళక తప్పదు.

* * *

కొన్ని సంవత్సరాల వెనక్కి నేను ప్రయాణం చేస్తే ...

అప్పట్లో ఆ వీధి ఇలా లేదు. అసలదింకా వీధి కానేకాదు. విశాలమైన మైదానం. నేను చూస్తుండగానే, ఇలాంటివి మాకింకా ఊహల్లోకి రాకముందే మెల్లమెల్లగా ఆ వీధి రూపుదిద్దుకొంది. అందుకు మొదటి దశ ఆ భవన నిర్మాణం. ఎవరు ఆ మొక్క నాటారో తెలియదు. భవనం పూర్తయ్యేసరికి ఓ మోస్తరుగా ఎదిగింది.

అదే ప్రారంభం...

నాతోనే అదీ పెరిగింది ... ఈ వీధి నుండి రకరకాల వాహనాలు... మనుషులు ...

ఇంకా రెండు పక్కలా భవనాలూ... వాటి ముందూ వెనకా చెట్లూ.

అది ఆ వీధికి చెందిన తొలి మొక్క... తర్వాత కాలంలో విభిన్న దశల తర్వాత మహావృక్షం కావడం వల్లనేమో నాకంత ప్రేమ...

వీధి ఏర్పడటం నా వరకు ఓ ఆశ్చర్యం... ఆ తర్వాత మొక్క... ఆ లేత ఆకుల రెపరెపలు...

ఎండలో రాల్చిన ఆకులు ... వానలో నిలువెల్లా స్నానం చేస్తూ ఊగిపోవడం ... కొమ్మ నుండి కొమ్మకు ఎదగడం ... ఎందరెందరో ఆ నీడలో సేదదీరడం ... ఆ చెట్టు నీడకొస్తే చాలు — ఒక్కసారిగా నా గతం తాలూకు వన్నీ నా ముందు నిలుస్తాయి.

అసలు ఆ వీధికి ఎటునుండి అడుగుపెట్టినా ముందుగా కనిపించేది అదే ...

ఇన్ని సంవత్సరాల తర్వాత ...

ఇప్పుడు ...

తిరిగి మరలా ఊహించనిది జరిగిపోతూంది ...

నా కళ్ళముందే ...

నేను నిస్సహాయంగా చూస్తుండగానే—

* * *

"నువ్వు ప్రేమించే, అభిమానించే నీ చెట్టు రేపట్నుండి వుండదు తెలుసా?"

"ఎవరు చెప్పారు. ఎందుకని వుండదు."

"దానికా యోగం పోయింది."

"అలా మాట్లాడకు. చెట్టుకు యోగం ఏమిటి? అయినా ఎందరెందరు ఆ నీడలో తృప్తిని అనుభవిస్తున్నారో మర్చిపోతే ఎలా?"

"కానీ ఆ చెట్టు వారి కోసం కాదు కదా"

"మరెవరి కోసం"

"ఆ భవనం స్వంతదారుడి కోసం"

"నిజమే కావచ్చు. ఇప్పుడేమయింది ఆ స్వంతదారుడికి"

"ఆ మొక్క పెరుగుతున్న దినాల్లో తనూ ఆనందించి వుంటాడు. కానీ ఇప్పుడలా కాదు."

"ఏమైందట ఇప్పుడు"

"కొంచెం ఆలోచించు"

నేను ఆలోచించాను. ఇన్ని సంవత్సరాలలో వచ్చిన మార్పులేమిటని...నిజమే. ఆ వీధి తనకంటూ ఓ రూపం ఏర్పరుచుకున్నాక సైడు కాలవలొచ్చాయి. ఎలక్ట్రికల్ తీగలొచ్చాయి. పెద్ద పెద్ద దీపాలు/వచ్చాయి. అంతస్థులు పెరుగుతూ వచ్చాయి. ఇప్పుడది కూడలి అయింది.

అయినాసరే ఆ చెట్టు ఓ అవసరం. ఓ అందం. ఓ నీడ.

"లేదు బాబూ. ఇప్పుడా చెట్టు రకరకాల సమస్యలు తెచ్చింది. ముందు దాని వ్రేళ్ళు గోడల్ని బ్రద్దలు చేశాయి. ఇంకా అవి పెరిగి పెరిగి విస్తరించి భవనం పునాదుల్ని కదిలిస్తాయేమోనని భయం. ఆ కొమ్మలు కరెంట్ తీగల మీద వాలి గాలికి తగిలినప్పుడు నిప్పురవ్వలు పుడుతున్నాయి.

ఇలాంటివే రకరకాలు.

"కాని అది"

"అందంగా వుందంటావ్. నీ చిన్ననాటి నేస్తం అంటావ్. కానీ ఈ వృక్షం మొక్కగా, పోనీ చిన్న చెట్టుగా వున్నప్పుడే ఆ భవనానికి అందం వచ్చింది. ఇప్పుడు ఈ చెట్టు భవనాన్ని మింగేసింది. ఆ భవనం అందం కనిపించాలన్నా, ముందు ఆ చెట్టు ఆక్రమించిన స్థలంలో మరి కొన్ని గదుల నిర్మాణం జరగాలన్నా ఆ చెట్టు వుండకూడదు. అందుకే దాన్ని తొలగిస్తున్నారు."

"కానీ ..."

"నీది ఆక్రోశం"

" ఆ చెట్టును రక్షించలేమా?"

"లేం. ఎందుకంటే ఆ భవనం స్వంతదారుడు దాన్ని అమ్మాడు. ఇంకా విస్తరించాలని చూస్తున్నాడు కనుక."

"అది నా జ్ఞాపకం"

"నీదే కాదు. నీ కాలం వారిది"

"నేను భరించలేను."

"దుఃఖించడం తప్ప మార్గం లేదు"

"ఇంతకీ ఏం చేస్తున్నారు"

"మరి కొద్దిగంటల్లో లేదా రోజుల్లో ఆ మహావృక్షం కూలి పోతుంది."

"నువ్వలా చెబుతుంటే కనీసం నీలో వేదన కనిపించడం లేదు"

"నిజమే. నేనెప్పుడూ ఆ చెట్టు గురించి అంతగా ఆలోచించి వుండ లేదు కాబట్టి."

నేను మాట్లాడలేదు. ఇప్పుడు నేను నిస్సహాయుడ్ని. ఈ విధ్వం సాన్ని ఆపే శక్తి నాకు లేదు. నా వరకూ అది జ్ఞాపకమే. అందరికీ ఎందుకు కాలేకపోయింది. ఏమో! ఎలా తెలుస్తుంది?

అయినా అంత అవసరం ఏముంది ...అది చెట్టు. మొక్కగా ఎదుగుతుంది. చెట్టుగా గట్టి పడుతుంది.... వృక్షంగా విస్తరిస్తుంది. అంతి మంగా కూలిపోతుంది.

ప్రకృతిలో ఏదైనా అంతేగా!

కాని ఇది అలాంటిదా? ప్రకృతి బీభత్సాలకు కూలిపోవడం కాదు.

మనుషులు... మనుషులు చేస్తున్నారు ఇదంతా ...

"నువ్వెందుకయ్యా అంత లోతుగా ఆలోచిస్తావ్. సమస్యలని సున్నితంగా తీసుకో ... ఎప్పుడైతే అది ఓ భవనం ముందు జనించిందో ఆ రోజే అది తన మరణ శాసనం రాసుకుంది. ఇంతకాలం జీవించి శాఖ లుగా విస్తరించింది. సంతోషించు"

అందుకేనా సంతోషం! నా సంతోషమంతా ఈ దుఃఖం కోసమా! ఇదిలా జరుగుతుందని ముందే తెలిస్తే జాగ్రత్తపడి వుందునే. కనీసం ఇంత మమకారం పెంచుకుని వుండకపోయేవాడ్నే...

"మొత్తం చెట్టు ఐదు వందలకి అమ్మేశారు. తెలుసుగా దానివల్ల ఇప్పటికే ఓమూల గోడ కూలిపోయింది. ఆ చెట్టును కొట్టుకు తీసుకుపెళ్ళే బాధ్యత కొనుక్కున్న వారిదే"

ఈ విధ్వంసం నేను చూడలేను. ఎక్కడికైనా పారిపోతే... ఏ పది రోజుల తర్వాతనో తిరిగివస్తే... అప్పుడేమిటి.... నిన్నటి వృక్షం నేడు వుండదు అంతేగా.... అది విషాదమే అయినా నాకళ్ళ ముందు ఎదిగిన దానిని కూలుస్తుండగా కన్నీళ్ళతో చూస్తూ నిలబడటమా!

మరేమిటి చెయ్యటం ?

పారిపోవడమే మార్గమా ?

కాదు. కానేరదు. ఎంత దూరం వెళ్ళినా అదే గుర్తుకువస్తుంది. ఆకాశంలోకి ఎగబాకిన కొమ్మలు శబ్దంచేస్తూ విరుచుకు పడుతున్నట్లే వుంటుంది.

మరింకేమిటి మార్గం...

భరించడమే !

చూస్తూనే వున్నా...

ఆవీథి ఇప్పుడు మనుషులతో కిటకిట లాడుతోంది. వారందరి చేతుల్లో గొడ్డళ్ళున్నాయి. లావాటి మోకులున్నాయి. వారందరి కండలూ బలంగా వున్నాయి. వారు నల్లగా వున్నారు. చెట్లు కూల్చడం వారికి బాధను కలిగిస్తుందా అనేది చెప్పలేం. వారందరు గోచీలు బిగించారు. బీడీలు వెలిగించారు.

"నేను దూరంగా నిలబడ్డా...

అక్కడ మాటలు... మాటలు...

గొడ్డలితో ఆ చెట్టు ఎక్కారు. తొలి దెబ్బ పడింది...

ఇంక నేను వుండలేకపోయా...

ఇన్ని దశాబ్దాల అనుబంధం మీద దెబ్బ అది... నేను వెనక్కి తిరిగినా ఆ మోత వినిపిస్తూనే వుంది...

ఆ గొడ్డలి దెబ్బకు చెట్టుకు గాయం అవుతూనే వుంది. ఆ విసురుకు లేచిన ఓ పేడు నన్ను బలంగా తాకింది...

వెనక్కి తిరిగా...

అప్పటికే సగం కొమ్మ గాయపడి వంగిపోయింది. మరి కొద్ది సేపట్లోనే పెళ పెళ మంటూ...

జనం పోగవుతున్నారు. ఓ క్షణం ఆశ్చర్యం... అంతలోనే వారి పెదవులమీద చిరునవ్వు...

ఎందుకంత సంతోషం? అదీ చెట్టు మాత్రమేనా చెట్టంటే ఏమిటి? ప్రాణం కాదూ. ఇప్పుడు విరుగుతున్నదీ దాని బాహువులు కాదూ...

అలా రాలిపోయిన చేతుల్లో...

నేను ఆ భవనపు హస్తాల్లో నా ముఖం దాచుకున్నా...

దెబ్బలు... దెబ్బలు... ఎక్కడో విరుచుకుపడుతున్న ధ్వని...

"చెట్టంటే చెట్టుకాదు. ఒక రోజులో తీయగలిగింది కాదు. ముందు కొమ్మలు నరుకుతున్నారు. తర్వాత రంపాలతో కోస్తారు".

"చాలు చెప్పకు వినలేను"

"అంతబాధ ఎందుకయ్యా... అయినా చెట్టుకు మరణం లేదు. ఆ మొదలు తలుపు చెక్కలవుతాయి. కిటికీలవుతాయి. డ్రెస్సింగ్ టేబు లవుతుంది... రాలిపడిన ఆ కొమ్మలు వంట చెరుకవుతాయి. ఇందులో ఏదీ వృథా కాదు".

సాయంకాలం అయింది.

అలసిపోయారు. విధ్వంసన కార్యక్రమం పాక్షికంగానే మిగిలి పోయింది. చాలా మంది ఆగి చూస్తున్నారు. ఇప్పుడది చెట్టుకాదు. కొమ్మలు నరికిన వృక్షం... ఇప్పుడయినా సరే. ఇలా ఆగిపోతే ఎంత బాగుంటుంది. తిరిగి ఈ చెట్టు మరికొన్ని సంవత్సరాలలో కొత్త చిగురులేస్తుంది.

కానీ ఆగేదెలా? నేను చెట్టు దగ్గరకు వెళ్ళి నిలబడ్డా...

"త్వర త్వరగా పూర్తిచేయండి. ఎక్కువ రోజులుచేస్తే మీ కూలీ సరిపోతుంది".

"చూస్తున్నారుగా బాబుస్వామీ... వంచిన నడుం ఎత్తలేదు. ఇదేం చిన్న మొక్కా ?"

"అవున్లే..! అయినాసరే త్వరగా కానిస్తే వాళ్ళు పనులు మొదలు పెట్టుకుంటారట".

"అట్టాగే"

అతను వెళ్ళిపోయాడు.

"మీరా బాబుగారు" పలకరించాడు.

మా ఇంటికి దగ్గరగానే వుంటాడు. అతనికి ఇలాంటి పనులే జీవనాధారం.

"ఇంకా ఎన్ని రోజులు పడుతుంది ?"

"రెండు రోజులన్నా పట్టుద్ది".

"అలాగా"

నేను కదిలి ముందుకు వెళ్ళాను.

సాయంకాలానికి... కొమ్మలులేవు. ఆకులు లేవు. పచ్చదనం లేదు. ఓ కళాఖండంలా మిగిలిపోయిన వృక్షం...

ఎందరెందరో వస్తున్నారు. ఓ కుర్రవాడు ఆగి అలా నిలుచున్నాడు. మరో యువకుడు తన కెమెరాతో ఓ స్నాప్ తీసుకున్నాడు. ఇంకెవరో ఓ బూతుమాట అన్నారు. ఇప్పుడు భవనంమీద స్వంత దారుడి పేరు అందరికీ కనిపించింది. మరికొందరు అసలిది ఓ విశేషంగా కూడా అంగీక రించం అన్నట్లు వెళ్ళిపోతున్నారు. ఏమైతేనేం అది నిన్నటి జ్ఞాపకం...

చూండగానేస్తు రంపాలు వచ్చాయి.

వాటిని చూస్తుంటే రాక్షసి కోరలు గుర్తొస్తాయి. వాటినలా చెట్టు ఉదరానికి ఆనిస్తే...

చూడకూడదనుకుంటాను. చూడకుండా వుండలేను. అఘోరకం శబ్దం... పొట్టు రాలుతోంది.

గొడ్డలికంటే వేగంగా... సున్నితంగా పని జరిగిపోయింది...

చిన్న చిన్న మొద్దులు తెగిపడ్డాయి.

ఇంక అసలు కార్యక్రమం మిగిలివుంది. వ్రేళ్ళతోసహా పెకలించడం...

సగం వరకు నరికాక మోకు చుట్టారు.

అప్పటి వరకూ వినోదం చూస్తున్న జనం కూడా కేరింతలు కొట్టుకుంటూ వచ్చారు. వారందరూ ఆ మోకు అందుకున్నారు.

ఎవరో పాట అందుకున్నారు,..

కోరస్...

చెట్టును ఉరి తీస్తున్నారు.

ఉరి తీస్తూ పాడుతున్నారు...

అయినా అది లొంగిరావడంలేదు—

మరి కొందరు వచ్చారు. కొంతమంది సులువైన పద్ధతులు చెప్పారు తిరిగి పాట...

జనం పెద్దగా అరిచారు... మెల్లగా... మెల్లమెల్లగా...

విరుగుతూ పెద్ద శబ్దం చేసింది...

కేరింతలు... కేరింతలు...

చెట్టు కూలినందుకు కేరింతలు...

"ఒరేయ్... చూడండిరా... నిన్నటి మొక్క అది. మీరు ఆ లేత ఆకులు చూసి సంతోషించారు. కోకిలలూ, చిలకలూ వాలిన చెట్టు అది. మనందరికీ పచ్చదనాన్ని అందించిన చెట్టది. దాని నీడలో విశ్రమించాక కొత్త శక్తులు నింపుకున్నాం. మిమల్ని ఎండలూ, వానలూ కాటేయాలనుకున్నప్పుడు తన రెక్కలు కప్పి కాపాడింది... దాన్ని నీ నేస్తాన్ని... మీ ప్రాణాన్ని... మీ చేతుల్తోనే ధ్వంసం చేసి... ఇంకా కేరింతలా...

కిందపడినా కూతలా!

తిరిగి రంపాల్తో మొదలంతా గాయాలు....

ఎప్పటికో అది కూలిపోయింది. అంతటితో పని పూర్తికాలేదు.

మొదలంతా త్రవ్వడం ఆరంభం ...

అక్కడో పెద్ద గొయ్యి తయారయింది.

దాన్ని మట్టితో కప్పేశారు...

నాలుగు రోజులుగా సాగింది ఆ కార్యక్రమం

అయిపోయింది...

ఇప్పుడక్కడ ఏమీ లేదు. నాకంతా శూన్యంగా వుంది. ఇంక నాకు ఈ ప్రపంచంలో దేని మీదా ఆశ లేదు. ఆరాటం లేదు. వేటి మీదా మమ కారం పెంచుకోకూడదనుకున్నా...

ఓ రాత్రివేళ ఆ చెట్టును కూల్చినతను వచ్చాడు.

'మొనగాటి చెట్టు బాబు అది'

ఇప్పుడు లేదుగా"

"అవును బాబు. దానికొమ్మ కూడా ఎంత గట్టిదనుకున్నారు...నేను మాత్రం ఓ కొమ్మ తెచ్చుకున్నా" అన్నాడు.

తనే తెచ్చి చూపించాడు. అంతా నున్నగా చెక్కాడు. చాలా బలంగా వుంది. దాన్ని స్పృశించగానే సంతోషమూ, దుఃఖమూ రెండూ కలిగాయి.

"ఏం చేస్తావ్....దీంతో"

"నా దగ్గర కొంచెం ఇనుం వుంది. సుత్తి తయారుచేయించుతా బాబు"

నాకు నవ్వు వచ్చింది.

ఓ మహావృక్షం చివరకి ఓ చిన్న సుత్తికి ఆధారం అయింది. ఏమైతేనేం అదలా అయినా బతికినందుకు సంతోషం కలిగింది...

నేను ఆ వీధిలోకి రావడంతో ఆరంభం అయ్యేది బాధ...

చాలా రోజులు....

ఆ శూన్యం పూడలేదు.

అక్కడో చెట్టు వుందని తెలియనివారు కొత్త గదుల్ని చూసి మురిసిపోయారు.

నాకు తెలుసు. ఆ గదులు చెట్టుకంటే విశాలం కాదని—

చిత్రమైన విషయం ఏమిటంటే—
తొలినాటి బాధ లేదు...
క్రమక్రమంగా నేను ఆ వీధికి అలవాటుపడిపోతున్నా—
నిన్నటి జ్ఞాపకంగానే అది మిగిలిపోయింది.
అయితే నా హృదయంలో అయిన గాయం మానలేదు...
మానదు కూడానేమో!

*　　*　　*

మరి ఇన్ని దశాబ్దాల తర్వాత...
జీవితం ఎంత కర్కశమైందో మరింత అనుభవానికి వచ్చాక...
ఈ వీధికీ...ఈ ఊరికి కూడా ఎంతో దూరమైపోయిన నేను ఇప్పుడు ఈ వీధిలోకి అడుగు పెడ్తున్నా...
ఇది ఆనాటి వీధేనా ?
కాదు....అవును....
ఎంత మార్పు...
నేను నడుస్తున్నా...
ఇక్కడ కదా ఒకనాటి మహావృక్షం నేలకూలింది...
శబ్దాలు...శబ్దాలు...
ఏమైంది ? మరలా ఏమైంది ?
నేను ఆరాటంగా లోపలి కెళ్ళాను.
అక్కడ కొంతమంది ఆ భవనపు గోడల్ని బద్దలు కొడుతున్నారు.
నేను వెళ్ళి ఓ అబ్బాయిని పిలిచాను.
"ఎందుకు బాబూ బద్దలు కొడుతున్నారు?"
"ఈ బిల్డింగ్‌ని కొనుక్కున్నవారు బద్దలు కొట్టమన్నారు"
"ఎందుకని"
"ఇది పాతబడిపోయింది. అందుకని కొత్తది కడతారంట"
"బాగానే వుందిగా"
"మనకి బాగానే వుంటుంది. వాళ్ళకి బాగుండలా"

"అలాగా"

నాకెందుకో ఆ అబ్బాయిలో ఎవరివో పోలికలు కనిపించాయి.

"నువ్వు ఎవరబ్బాయివి ?"

చెప్పాడు.

"ఆయనా...నాకు తెలుసు. మేం కూడా అక్కడ వుండేవాళ్ళం. మీ నాయన బతికున్నాడా...."

"లేదు"

నేను అతని చేతిలో సుత్తికేసి చూశాను.

"మీ నాన్న ఇచ్చిందేనా ?"

"అవును"

"వెళ్ళు...బద్దలు కొట్టు..." అన్నాను ఉద్వేగంతో.

అతను ఆశ్చర్యంగా చూసుకుంటూ వెళ్ళాడు...

ఒక్కో దెబ్బ ... దెబ్బమీద దెబ్బ పడుతూనే వుంది.

అది విధ్వంసనమే...

అయినా సరే...

నాకది శ్రావ్యమైన సంగీతంలా వుంది.

ఇప్పుడది...ఆ వృక్షం వృక్షం కాదు... నిన్నటి జ్ఞాపకం కాదు... ఆయుధం!

—ఆదివారం 'ఆంధ్రజ్యోతి'

—డాక్టర్ కె. విజయరాఘవరెడ్డి, హైదరాబాద్ వారిచే హిందీలోకి అనువదించబడింది.